# ఆదమరిస్తే అంతే!

- ప్రాణాంతకంగా మారుతున్న ధాన్యం రాశులు
- రహదారులపై గుట్టలుగా పోస్తున్న రైతులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు


అంగర-వెదురుమూడి ఆర్అండ్‌బీ రహదారిపై ఆరబెట్టిన ధాన్యం

**కపిలేశ్వరపురం:** చిన్న నిర్లక్ష్యం.. ఖరీదు నిండు ప్రాణం. సులువుగా తమ పని అవుతుందన్న కారణంతో రోడ్డుపై గుట్టలుగా వేసే ధాన్యం రాశులు కాస్తా ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. గడ్డిపోచలే కదా అని ఆదమరిస్తే.. క్షణంలో యమపాశాలుగా మారి భీతిగొల్పుతున్నాయి.

ఖరీఫ్ ధాన్యం మాసూలు పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో.. రైతులు సమీపాన ఉన్న రహదారులపైనే ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. దీని వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి.

**రహదారులపైనే ధాన్యం నిల్వలు**

మండపేట-కపిలేశ్వరపురం, వల్లూరు-టేకి, కోరుమిల్లి-టేకి, మండపేట-ఏడిద, మాచవరం-రాయవరం, కోటిపల్లి-కె.గంగవరం, పామర్రు-అంగర తదితర ప్రధాన రహదారులపై రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ధాన్యం ఆరుదల అనివార్యమైన నేపథ్యంలో.. రైతులు రహదారులపై ఆరబెడుతున్నారు. రాత్రివేళలో రాశులుగా పోసి, బరకాలతో కప్పి ఉంచుతున్నారు. దీంతో ఆదమరచిన వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లపై రాశులు పోసే రైతులు కాస్త విచక్షణతో ఆలోచిస్తే.. ప్రాణాలు కాపాడిన వారవుతారని వాహనదారులు అంటున్నారు.

**నిండు ప్రాణాన్ని హరిస్తున్న నిర్లక్ష్యం**

మండపేట మండలంలోని తాపేశ్వరం మలుపు, కపిలేశ్వరపురం మండలంలోని గోదావరి గట్టు, వెదురుమూడి గజ్జెరపువారి చావిడి తదితర మలుపులు మృత్యుకుహరాలని గత ప్రమాదాల తీరు తేటతెల్లం చేస్తున్నాయి. ధాన్యం రాశులను తప్పించే క్రమంలో వాహనాలు నిబంధనలు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్నాయి.

ఆకస్మికంగా మలుపులు తిరగడంతో వెనుకనే ఉన్న ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారికి ఓవైపు ధాన్యం రాశులుగా వేస్తుండటం, మిగిలిన మార్గంలోనే ఎదురెదురుగా వాహనాలు రాకపోకలు సాగించాల్సి రావడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇలాఉండగా 2017 నవంబర్ పదిన ధాన్యం రాశులున్న రహదారిపై ఆటోలో వెళ్తున్న అంగరకు చెందిన కానూరి వీరరాఘవ(బూరమ్మ) వెదురుమూడి గ్రామ శివారు కముజుల కొంపలు వద్ద వాహనం నుంచి జారిపడి మరణించింది. ఇంచుమించు అదే ప్రాంతంలో అంతకు ముందురోజే నవంబర్ తొమ్మిదిన రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ధాన్యం రాశుల కారణంగా తరచూ చిన్నాచితకా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రయాణికులు గాయాల పాలవుతూనే ఉన్నారు. ప్రాణనష్టం జరగకపోవడంతో ఇలాంటి సంఘటనలు పోలీసుల వరకూ చేరడం లేదు.

**నిబంధనలకు చెల్లుచీటీ**

గత సంఘటనలను దృష్టిలో పెట్టుకుని వాహన చోదకులు రహదారి నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉంది. అపాయకర ప్రదేశాలు, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా.. ద్విచక్ర వాహనదారులు అమిత వేగంతో ప్రయాణిస్తూనే ఉన్నారని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన చోట్ల బ్లాక్ స్పాట్లను గుర్తించి, ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని, వంద మీటర్ల దూరం నుంచి కనిపించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలంటూ ఉన్నతాధికారులు చేసిన నిర్ణయాలు.. అమలుకు నోచుకోకపోవడం వల్ల కూడా ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోందన్న అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

**చర్యలు తప్పవు**



రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టినా, రాశులుగా వేసినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రైతులు ఈ విషయాన్ని గమనించాలి. రహదారులపై రాకపోకలకు ఆటంకాలు లేకుండా సహకరించాలి. విలువైన ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా, బాధ్యతతో వ్యవహరించాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్ట పరిధిలో చర్యలు తప్పవు.

– జి.చంటి, ఎస్సై, అంగర

## గ్రామాల అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం


కపిలేశ్వరపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

**కపిలేశ్వరపురం:** గ్రామాల అభివృద్ధి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కపిలేశ్వరపురంలో సోమవారం ఇంటింటికీ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీలు శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా మురళి, పీతల బంగారంతో కలిసి గ్రామంలో ఇంటింటికీ పర్యటించారు. ఎమ్మెల్సీ తోటకు మహిళలు హారతులు పట్టారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, సచివాలయ ఉద్యోగులుతో కలిసి కుటుంబాల వారీగా ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. గ్రామంలో పేదలకు పింఛన్లు, ఇళ్ల స్థలాలు తదితర ప్రభుత్వ పథకాలను మంజూరు చేయించిన ఎమ్మెల్సీకి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారులు, చేతివృత్తిదారులు, దళితులు, వెనుకబడిన, ఇతర సామాజిక వర్గాలవారు ఆయన వెంట నడిచారు. ఈ కార్యక్రమంలో మండల సాగు సలహా మండలి సభ్యుడు మేడిశెట్టి దుర్గారావు, పార్టీ నాయకులు చింతా పెద్దకాపు, అంగాని నూకరాజు, అరదాని శ్రీదేవి, కుడుపూడి విజయ్, మల్లిపూడి శివకుమార్, సేవాదళ్ కన్వీనర్ పాలింగి కిశోర్, సచివాలయాల కన్వీనర్ పాలింగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సంస్కార విద్యతో పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసం

**రాయవరం:** పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసాన్ని అందించేందుకే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సంస్కార విద్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు విశ్వమానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి పేర్కొన్నారు. స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వీఎస్ సునీత ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు సంస్కార విద్యపై సమావేశాన్ని నిర్వహించారు. భావిభారత పౌరులకు మంచి ఆరోగ్యం, ఉత్తమ సంస్కారం ఇవ్వడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సమష్టిగా కృషి చేస్తేనే లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు.

## క్లుప్తంగా

### గోపూజ చేసిన ఎమ్మెల్సీ దంపతులు


గోపూజ చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులు

**కపిలేశ్వరపురం: (మండపేట):** గో అష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండపేట పట్టణం గొల్లపుంత రోడ్డులో శ్రీకామేశ్వరీదేవీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం గోపూజ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సూర్యకుమారి దంపతులు గోపూజ చేశారు. నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పెంకే గంగాధర్, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, సచివాలయాల కన్వీనర్ దుగ్గిరాల గణేష్ పాల్గొన్నారు.

### నిత్యావసర సరకులు పంపిణీ

**కె.గంగవరం:** కూళ్ల గ్రామానికి చెందిన పలివెల సుబ్బాయమ్మ, భట్లపాలిక శివారు రావిదొడ్డిపేట గ్రామానికి చెందిన పెయ్యల చైతన్య, శేరిలంక గ్రామానికి చెందిన కొండేపూడి మరిడి ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను జనసేన నాయకుడు పోలిశెట్టి చంద్రశేఖర్ సోమవారం పరామర్శించారు. పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు చారిటబుల్ మెమోరియల్ ఫౌండేషన్ తరపున బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు.

### అంగన్‌వాడీల ఆందోళన

**కపిలేశ్వరపురం:** తమ సమస్యల పరిష్కారం కోరుతూ కపిలేశ్వరపురం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సోమవారం ఆందోళనకు దిగారు. వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాలల్లో విలీనం చేసే ఆలోచనను విరమించుకోవాలని కోరుతూ ప్రాజెక్ట్ సీడీపీఓ అధికారి గజలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

### బాలల హక్కులను పరిరక్షించాలి


కపిలేశ్వరపురంలో నినాదాలు చేస్తున్న విద్యార్థులు

**కపిలేశ్వరపురం:** భావి భారత పౌరులైన బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో వక్తలన్నారు. ఆలమూరుకు చెందిన శ్రమ స్వచ్ఛంద సంస్థ, క్రై సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కపిలేశ్వరపురం, వల్లూరు, వెదురుమూడి, అంగర తదితర గ్రామాల్లో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. కపిలేశ్వరపురం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

### మెరుగుపడిన ప్రజల జీవన ప్రమాణాలు


చెల్లూరులో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ రాఘవ, ఇతర నాయకులు

**రాయవరం:** వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నవరత్న పథకాల ద్వారా ప్రతిఒక్కరి జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ పేర్కొన్నారు. చెల్లూరులో సర్పంచ్ పాలిక రాఘవ ఆధ్వర్యంలో సోమవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, వెంకటరమణ, రాఘవ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం రాష్ట్రానికి చాలా ఉందన్నారు. ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అన్ని వర్గాలకూ ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సచివాలయం పరిధిలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి బోర్డులను సర్పంచ్ రాఘవ ఆవిష్కరించారు. అలాగే వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వైట్ల వీరవేణి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు, ఎంఎల్‌వో రాజేష్, మండల సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, మండల బూత్ కమిటీ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, చిక్కాల శ్రీరాములు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

**ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు**


మారేడుబాకలో ఇంటి పట్టాను అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

**కపిలేశ్వరపురం (మండపేట):** నియోజకవర్గంలో పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా తాను కృషి చేస్తున్నానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట మండలం మారేడుబాకలో సోమవారం 15 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, ఎంపీటీసీ చొల్లంగి సత్యవేణి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 31 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలివ్వడం ద్వారా పేదల పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచారన్నారు. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేని గ్రామాల్లో ప్రైవేటు భూములను కొనుగోలు చేసి మరీ పేదలకు స్థలాలు ఇవ్వడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. మారేడుబాకలో 275 మందికి ఇళ్ల పట్టాలు అందజేయడంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు రూ.1.80 లక్షలు హౌసింగ్ రుణం ఇవ్వడం పేదలకు చేయూతగా నిలిచిందని పార్టీ నాయకులన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, ఉప సర్పంచ్ టేకి దుర్గారావు, సొసైటీ చైర్మన్ కొండపల్లి రాజేంద్ర ప్రసాద్, పార్టీ నాయకులు కుడిపూడి రాంబాబు, కాదా మాచరరావు, సుంకర రాజు, పొడగట్లపల్లి త్రిమూర్తులు, సచివాలయం కన్వీనర్ కాళ్ల ఎస్తేరు రాణి పాల్గొన్నారు.

## సామాన్యుల ప్రగతికి ప్రభుత్వం కృషి

**చైర్‌పర్సన్ దుర్గారాణి**


మండపేటలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

**కపిలేశ్వరపురం (మండపేట):** సామాన్య ప్రజల ప్రగతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. పట్టణంలోని 12వ సచివాలయం పరిధిలోని 25, 26 వార్డుల్లో సోమవారం 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి?' కార్యక్రమాన్ని నిర్వహించారు. చైర్మన్ దుర్గారాణి మాట్లాడుతూ సీఎంగా బాధ్యతలు చేపట్టిన కొద్ది నెలలకే నూరుశాతం ఎన్నికల హామీలను అమలుపర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు.

సచివాలయం పరిధిలో చేపట్టిన పథకాలను స్థానికులకు వివరించారు. వార్డు కౌన్సిలర్లు ముక్కా మేరీ స్వరూపారాణి, అమలదాసు లక్ష్మి మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ఎమ్మెల్సీ తోట, చైర్‌పర్సన్ దుర్గారాణి చేస్తున్న కృషిని కొనియాడారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు మాట్లాడుతూ రూ.18.83 కోట్లతో సచివాలయ పరిధిలో ప్రగతి సాధించడం విశేషమన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, మున్సిపల్ మేనేజర్ టి.కనకరాజు, సచివాలయ కన్వీనర్లు గెద్దాడ అన్నవరం, సోమని శ్రీనివాసు, మీసాల కొండబాబు, సోషల్ మీడియా కన్వీనర్ కోళ్ల శ్రీను, పార్టీ నాయకులు పేకేటి మాణిక్యం, బోసు పాల్గొన్నారు.

## జగనన్నతోనే సంక్షేమ పాలన

**కాజులూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్'**


అద్దంపల్లిలో మహిళలకు పథకాలను వివరిస్తున్న నాయకులు


కాజులూరులో పార్టీ జెండాను ఆవిష్కరించిన నాయకులు

**కాజులూరు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు అన్నారు. కాజులూరు-3 సచివాలయ పరిధిలో సోమవారం సర్పంచ్ దండంగి సరోజిని అధ్యక్షతన «వై ఏపీ నీడ్స్ జగన్» కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం ఆవరణలో జరిగిన సభలో ఏసురాజు, ఇతర నేతలు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నర ఏళ్లలో గ్రామస్తులకు వివిధ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరించారు. దళారుల ప్రమేయం లేకుండా పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారులకు అందజేశారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని శాఖల అధికారులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారన్నారు. ఇంత చక్కటి పాలన అందాలంటే రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి మరలా సీఎం కావాలన్నారు. అనంతరం పథకాల బోర్డులను ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. వలంటీర్ల ద్వారా ఇంటింటికీ తిరిగి, పథకాల లబ్ధిని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ మాత భారతి, వైస్ ఎంపీపీ రేఖాడి విజయ, నాయకులు పెంకే సత్యనారాయణ, యాళ్ల ధనరాజు, మేడిశెట్టి శ్రీను, బాబురావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సంక్షేమం అందాలంటే జగనే రావాలి**

**కె.గంగవరం:** కులం, మతం, పార్టీ బేధాల్లేకుండా, పారదర్శకంగా సంక్షేమ పథకాలందాలంటే ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్, ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని అద్దంపల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులైన వీరు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చారన్నారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్ చింతపల్లి లక్ష్మి, వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ తోకల శ్రీను, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు బత్తుల అప్పారావు, కన్వీనర్లు చింతపల్లి వాసు పాల్గొన్నారు.

## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో బహుమతులతో చిన్నారులు


మాచవరం లైబ్రరీలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రజాప్రతినిధులు


కపిలేశ్వరపురం గ్రంథాలయంలో బహుమతులందుకున్న విజేతలు

**రామచంద్రపురం రూరల్/రామచంద్రపురం:** జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ములంపాక వీరసూరిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగి అల్లం ఆదినారాయణ, మాజీ సర్పంచ్ ముద్రగడ వీరవెంకటసత్యనారాయణ, సూర్య విద్యాసంస్థల డైరెక్టర్ దొడ్డా సత్తిబాబు పాల్గొన్నారు. రామచంద్రపురం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ దడాల వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్ తోట అమ్మాజీ, ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు టీవీ రాఘవరెడ్డి, సీహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

**పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలి**

**రాయవరం:** విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలని పలువురు పేర్కొన్నారు. మాచవరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభను లైబ్రేరియన్ టి.ప్రమీల అధ్యక్షతన నిర్వహించారు. సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీ కొవ్వూరి అమ్మిరెడ్డి, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జగన్మోహిని, రిటైర్డ్ పీఎస్ హెచ్ఎం మేడపాటి నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నేత పడాల శ్రీనివాసరెడ్డి తదితరులు మాట్లాడారు. విజ్ఞానాన్ని పెంపొందించడంలో లైబ్రరీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వైఎస్సార్ సీపీ నేతలు కత్తుల అప్పారావు, పలివెల సతీష్, కోట వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

**గ్రంథ పఠనంతో సామాజిక ప్రగతి**

**కపిలేశ్వరపురం:** సామాజిక ప్రగతికి గ్రంథ పఠనం అవసరమని స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో వక్తలు అన్నారు. ప్రతిభా పోటీల విజేతలకు సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, హెచ్ఎం వంగా శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి బహుమతులు అందజేశారు. మాజీ సర్పంచ్ మేకా సత్యవరప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

**గ్రంథాలయాలను ప్రోత్సహించాలి**

**కాజులూరు:** ప్రజాదరణ కోల్పోతున్న గ్రంథాలయాలను ప్రజలు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఎంపీపీ మాత భారతి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. లైబ్రేరియన్ కె.ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ యాంత్రిక జీవనంలో పుస్తక పఠనానికి అందరూ దూరమవుతున్నారని పేర్కొన్నారు.

అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ దండంగి సరోజిని, ఉప్పుమిల్లి ఎంపీటీసీ కొప్పుశెట్టి కృష్ణమూర్తి, మండల పశువైద్యాధికారి జి.సుధీర్, మాత మురళి పాల్గొన్నారు.

## శివాలయాల్లో భక్తుల సందడి

- కార్తిక తొలి సోమవారం ప్రత్యేక పూజలు
- మార్మోగిన శివనామ స్మరణలు


గొల్లపాలెం శివాలయంలో స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు


కోటిపల్లి గోదావరిలో దీపాలు వదులుతున్న భక్తులు


క్యూలైన్లలో స్వామివారి దర్శనానికి వేచిఉన్న భక్తులు

**కాజులూరు:** మండలంలోని శివాలయాల్లో సోమవారం భక్తుల సందడి నెలకొంది. కార్తికమాసం తొలి సోమవారం కావటంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. హరహర మహదేవ.. శంభోశంకరా..., ఓం నమశ్శివాయ.. అంటూ శివనామ స్మరణతో ప్రదక్షిణలు చేశారు. తెల్లవారుజాము నుంచే స్వామివారికి అభిషేకాలు చేయించే భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. మండలంలోని గొల్లపాలెం, కాజులూరు, శీల, దుగ్గుదూరు, కుయ్యేరు, అయితపూడి, పెనుమళ్ల, అంద్రంగి, పల్లిపాలెం, ఉప్పుమిల్లి, కొలంక, జగన్నాథగిరి గ్రామాల్లోని శివాలయాల్లో తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే అభిషేకాలు ప్రారంభమయ్యాయి. స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**జనసంద్రంగా కోటిపల్లి ఆలయం**

**కె.గంగవరం:** కార్తిక మాసం తొలి సోమవారం కావడంతో మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తుల సందడి నెలకొంది. కోటిపల్లి, పామర్రు, కె.గంగవరం, యర్రపోతవరం, భట్లపాలిక, యండగండి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటిపల్లిలోని శ్రీఛాయా సోమేశ్వర స్వామి ఆలయం భక్తులతో జనసంద్రంగా మారింది. గౌతమి గోదావరి నదిలో తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటీ పడ్డారు. మహిళలు గోదావరిలో దీపాలు వదిలి పూజలు చేశారు. ఆలయ ఈఓ శ్రీదేవి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కె.గంగవరంలో దంగేరు, తామరపల్లి, సత్యవాడ తదితర గ్రామాల్లోని శివాలయాల్లో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు.

**భీమేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు**

**రామచంద్రపురం రూరల్:** కార్తిక మాసం మొదటి సోమవారం పురస్కరించుకుని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ శ్రీమాణిక్యాంబ సమేత శ్రీభీమేశ్వర స్వామివారి ఆలయంలో భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి చేరుకున్నారు. సప్తగోదావరిలో స్నానమాచరించి స్వామిని దర్శించుకున్నారు. ముందుగా క్షేత్ర పాలకుడైన శ్రీలక్ష్మీనారాయణ స్వామివారిని, భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లు, చిన్నారులకు పాలు అందించే ఏర్పాట్లు చేశారు. వృద్ధులు, చంటిబిడ్డల తల్లులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తిక నోముల పూజలు రుత్విక్కులతో జరిపించుకున్నారు. ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు.

## రుద్రాక్ష శివలింగం ఏర్పాటు


వేగాయమ్మపేట రామాలయంలో ఏర్పాటు చేసిన రుద్రాక్ష శివలింగం

**రామచంద్రపురం రూరల్:** వేగాయమ్మపేటలో ద్రాక్షారామ బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో కార్తిక సోమవారం పురస్కరించుకుని రుద్రాక్ష శివలింగం ఏర్పాటు చేశారు. గ్రామంలోని దివాణం వీధి రామాలయంలో వేగాయమ్మపేట జమీందారు వాడ్రేవు సుందర రత్నాకరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. శక్తివంతమైన, పవిత్రమైన రుద్రాక్ష శివలింగాన్ని భక్తులు దర్శించుకునేందుకు మంగళ, బుధవారాల్లో కూడా అందుబాటులో ఉంచుతామని బ్రహ్మకుమారి బిందు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు కర్రి వెంకటేశ్వరరావు, కోటిపల్లి ఆదేశ్వరసూర్యనారాయణ, పున్నమరాజు భీమేశ్వరరావు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం


మాట్లాడుతున్న అశోక్‌కుమార్

**రాయవరం:** ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, ఎస్సీ వర్గీకరణ ద్వారా మాల, మాదిగ కులాల్లో చిచ్చు పెడుతున్నారని పీవీ రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ అన్నారు. రాయవరంలో అశోక్‌కుమార్ సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక సంవత్సరాలుగా జరిగిన ఎస్సీ వర్గీకరణ ఉద్యమాల వల్ల.. ఎస్సీల్లోని ఇరువర్గాలు నష్టపోయాయన్నారు. ఎస్సీలకు అందాల్సిన ఫలాలపై ఐక్య ఉద్యమాలకు ప్రయత్నిస్తున్న తరుణంలో మంద కృష్ణమాదిగ తన వ్యక్తిగత స్వార్థంతో, ఎన్నికలొచ్చినప్పుడు ఈ సమస్యను బయటకు తెస్తున్నారని విమర్శించారు. మాదిగ సామాజిక వర్గ ఓట్లను వేయిస్తానని నమ్మించి, ప్రధాని మోదీని మాదిగ విశ్వరూప సభకు రప్పించడం, ఎస్సీల్లోని ఉప కులాలను రెచ్చగొట్టడమేనన్నారు. సుప్రీంకోర్టు తీర్పును కించపర్చేలా ఎస్సీ వర్గీకరణపై కమిటీ వేస్తానని ప్రధాని చెప్పడం విచారకరమన్నారు. ప్రధాని ఎస్సీ వర్గీకరణ జోలికి రాకుండా ఉంటే మంచిదన్నారు. లేకుంటే మిగతా పార్టీల గతే పడుతుందని హెచ్చరించారు. వర్గీకరణ, ఇతర ఎస్సీల సమస్యలపై జాతీయ రాజకీయ పక్షాలను కలిసి ఢిల్లీలో నిరసన తెలియజేయడానికి వచ్చే నెలలో పార్లమెంట్ సమావేశాల సందర్భంగా 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. సమావేశంలో సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాకర రాము, సన్నపు శేఖర్, బత్తుల జాన్, నేతల రాజు, పైసాదాసు పాల్గొన్నారు.